## • ‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

## • పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట



గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

## గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

# గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ–1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

## దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

## సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

### జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.





లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు



వీర్ల నర్సవ్వ



ఆది రాజవ్వ

## మహా కుంభమేళాకు వెళ్లి ..

### తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.



## ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహులు


## మైసమ్మ ఆలయ ఈవోగా నర్సింహులు

నవాబ్‌పేట, జనవరి 31 : మండలంలోని ఫతేపూర్ మైసమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా నర్సింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈవోగా పని చేసిన మదనేశ్వర్‌రెడ్డికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై జిల్లా కేంద్రానికి బదిలీ కావడంతో.. తలకొండపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈవోగా పని చేస్తున్న నర్సింహులు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మైసమ్మ ఆలయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పని చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బాలసదన్‌ను సందర్శించిన కలెక్టర్

నారాయణపేట టౌన్, జనవరి 31 : పట్టణంలోని సుభాష్ రోడ్డులో ఉన్న బాలసదన్‌ను శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ సందర్శించారు. బాలసదన్‌లో గదులు, కిచెన్‌ను, పరిసరాలను, రికార్డులను పరిశీంచారు. కొత్తగా నిర్మించబోయే పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని డీడబ్ల్యూవో జయకు సూచించారు.

## మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రావు



బాధ్యతలు చేపడుతున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు

అలంపూర్, జనవరి 31 : అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చంద్రశేఖర్‌రావు సెక్రటేరియట్ నుంచి బదిలీపై అలంపూర్‌కు వచ్చారు. బాధ్యతల స్వీకరణకు ముందుగా పట్టణంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకొన్నారు. గతం లో రాజయ్య ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగగా చంద్రశేఖర్‌రావు రెగ్యులర్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

## జాతీయ హోదా కల్పించాలి

నారాయణపేట, జనవరి 31 : పాలమూరు రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి జరుగుతున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో పేట జిల్లాను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కృష్ణ వికారాబాద్ రైల్వేలైన్ ప్రారంభించాలని, జిల్లా కేంద్రానికి సైనిక పాఠశాల మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాం, గోవింద్‌రాజ్, దస్తప్ప, కాశప్ప, సత్యప్ప, పవన్ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తూ మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

# ప్రత్యేక పాలన.. ప్రగతి సాధించేనా.?

- పాలమూరులో ఎక్కడికక్కడే నిలిచిన పనులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 31 : మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని అనేక మున్సిపాలిటీల్లో పాలకవర్గ పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఇప్పటి వరకు సమస్యలను వార్డు కౌన్సిలర్లు, మెంబర్ల దృష్టికి తీసుకొచ్చారు. వీటిని చైర్మన్ ద్వారా కమిషనర్లకు తెలిపి అప్పటికప్పుడు పరిష్కరించారు. పాలకవర్గ సభ్యులు మాజీలు కావడంతో అధికారులపై భారం పెరిగింది. ఆయా డివిజన్, వార్డు అధికారులతోపాటు కమిషనర్లు కనీస సౌకర్యాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ కొనసాగుతున్న నేపథ్యంలో డివిజన్, వార్డుల పరిధిలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనుల్లో పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతు న్నారు.



గోల్‌మజీద్ ప్రాంతంలో బోర్‌వెల్ నుంచి లీకేజీ అవుతుండడంతో వృథాగా పారుతున్న నీరు

### అసంపూర్తి పనులతో అవస్థలు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో చివరి పాలకమండలి సమావేశంలో రూ.43.79కోట్లు సాధారణ, జనరల్ ఫండ్, ఇతర నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించినా 75శాతానికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రహదారులు, కాల్వలు ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. సాధారణ నిధులతో టెండర్లు నిర్వహించగా, ఇటీవల పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. వీటిని ప్రారంభించాల్సి ఉండగా, నిలిచిపోయిన పనులు పూర్తి చేయాల్సి ఉంది.



పాతపాలమూరులో అర్ధాంతరంగా నిలిచిన పైపులైను పనులు

### పారిశుధ్యం అధ్వాన్నం..

శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా మారాయి. ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త సేకరణలో సైతం అరకొర విధులు నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమల బెడద పెరుగుతుండగా, అన్ని వార్డుల్లో ఫాగింగ్ జరిగేలా చూడాల్సిన అవసరమున్నది.

### లీకేజీలు.. వెలగని దీపాలు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పైపులైన్ల లీకేజీలకు లెక్కే లేదు. మరమ్మతుల్లో జాప్యం చేస్తున్నారు. దీంతో వేసవిలో అనేక వార్డుల్లో తాగునీటికి కుస్తీలు పడాల్సి వస్తోంది. పట్టణంలోని వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది.

# జనం గుండె చప్పుడు గద్దర్

అయిజ, జనవరి 31 : జనం గుండెల చప్పుడై గళం ఎత్తిన ప్రజా గాయకుడు గద్దర్ అని మాల మహానాడు నాయకులు అన్నారు. శుక్రవారం అయిజ పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో గద్దర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు కాలికి గజ్జెకట్టి గళం విప్పిన గొప్పగాయకుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మల్లికార్జున్, శివరాజు, కృష్ణ, నాగరాజు, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సమాజ చైతన్య విప్లవకారుడు గద్దర్

గద్వాల జెడ్పీ సెంటర్, జనవరి 31 : సమాజ చైతన్య ఉద్యమ కెరటం గద్దర్ అని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని నిర్వహించారు.

### గర్వించదగ్గ కళాకారుడు

గద్వాల అర్బన్, జనవరి 31 : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి గళమెత్తిన గద్దర్ గర్వించదగ్గ కళాకారుడని జిల్లా పౌర సంబంధాల అధికారి మహమ్మద్ అరిపుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో రాష్ట్ర సంస్కృతిక శాఖ అధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### గద్దర్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్, జనవరి 31 : ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతిని శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పండితులు గిరిరాజాచారి, దేవన్ననాయుడు, బాలేమియా, బండలయ్య, బీచుపల్లి, పరమేశ్వర్, సత్యంచారి, రఘునాథ్‌రెడ్డి, వెంకటేశ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

## సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు


వడ్డేపల్లి, జనవరి 31 : మంచి సమాజ నిర్మాణం కోసం ఉపాధ్యాయులే మార్గదర్శులుగా ఉంటారని ఎంఈవో నర్సింహ అన్నారు. శుక్రవారం శాంతినగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు శామ్యూల్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులతో కలిసి ఘనం సన్మానించారు. కార్యక్రమంలో దేవేంద్రారెడ్డి, వెంకటనర్సమ్మ, వెంకట్రావు, నరేశ్, మేరమ్మ, ఊషన్న, మద్దిలేటి, శంకర్, గోపాల్, విజయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

## పశువులపై కారుణ్యభావంతో ఉండాలి


నారాయణపేటటౌన్, జనవరి 31 : పశువులపై ప్రతిఒక్కరూ కారుణ్యభావంతో ఉండాలని జిల్లా పశువైద్యాధికారి ఈశ్వర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి అనిరుధ్ ఆచార్య అన్నారు. పశు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు వైద్య శాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు.

## నూతన కమిషనర్‌కు సన్మానం

నారాయణపేట, జనవరి 31 : నారాయణపేట మున్సిపల్ కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన బుగేశ్వర్‌ను శుక్రవారం మెప్మా డీసీఎం శివకుమార్‌తోపాటు ఆర్పీలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎల్‌ఎఫ్ అధ్యక్షులు సాయి, ఉమా, ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య, ఆర్పీలు లింగమ్మ, విద్య, మీనా, అనిత పాల్గొన్నారు.



నూతన కమిషనర్‌ను సన్మానిస్తున్న డీసీఎం, ఆర్పీలు





మక్తల్ మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కమిషనర్‌కు సన్మానం

మక్తల్, జనవరి 31: మక్తల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ నాయక్‌ను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిసున్న భోగేశ్వర్ ఇటీవలే బదిలీపై నారాయణపేట జిల్లా కేంద్రానికి వెళ్లగా, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శంకర్‌నాయక్ ఇక్కడికి బదిలీ వచ్చారు. సన్మానించిన వారిలో మక్తల్ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, అన్వర్ హుస్సేన్, రాజు, మన్నన్, సాధిక్ ఉన్నారు .

## కాల్వలో పడి వ్యక్తి మృతి

మక్తల్, జనవరి 31: సంగం బండ జలాశయం కాల్వ పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి కథనం ప్రకారం మండలంలోని సంగం బండ గ్రామానికి చెందిన సాబెప్ప(35) మద్యానికి బానిసై తిరుగుతుండేవాడని, అదే తరహాలోనే ఈనెల 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానన్న వ్యక్తి 31తేదీన సంగం బండ జలాశయం ఎడమ కాల్వలో శవమై తేలాడన్నారు. జలాశయంలో మృతదేహం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు కాల్వ వద్దకు వెళ్లి మృతదేహాన్ని తీసి సాబెప్పగా గుర్తించి పంచనామా నిర్వహించారు. భార్య తాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు.

## రిటెండర్లు వేయాలి

మహ్మదాబాద్, జనవరి 31 : పాఠశాల షెట్టర్లను రిటెండర్లు వేయాలని గ్రామస్తులు మండల కేంద్రంలో టెంటు వేసుకొని వంటవార్పు చేశారు. పాఠశాలకు సంబంధించిన వ్యాపార దుకాణాల్లో కొన్ని సంవత్సరాలుగా వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటుండగా గ్రామస్తులు తమకు కూడా షెట్టర్లలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని రోడ్డుపై ఆందోళన చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. షెట్టర్లకు రిటెండర్లు వేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం మండల అధికారులు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా తాసీల్దార్ తిరుపతయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంఈవో రాజునాయక్, ఎస్సై శేఖర్‌రెడ్డి నియమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో మౌలిక వసతులు కల్పించాలి

నారాయణపేటటౌన్, జనవరి 31 : ప్రభుత్వ దవాఖానలో మౌలిక వస తులు కల్పించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన చేపట్టి డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానలో ఫీజుల దోపిడీని అరికట్టి నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు యాదగిరి, పీవైఎల్ జిల్లా కోశాధికారి రాము, సహాయ కార్యదర్శి అంజప్ప, పీవోడబ్ల్యూ జిల్లా కోశాధికారి మహాదేవి, సభ్యులు సునీత, లక్ష్మి, అరుణ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎల్‌ఎన్ వివరాలను ఆన్‌లైన్ చేయాలి

నవాబ్‌పేట, జనవరి 31 : పాఠశాలల్లో చేపడుతున్న విద్యార్థుల ఎఫ్‌ఎల్‌ఎన్ బేస్‌లైన్ వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఏఎంవో శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక స్థాయి పాఠశాల కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగ్యానాయక్, జీహెచ్‌ఎంలు దశరథ్‌నాయక్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నా రు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవాబ్‌పేట, జనవరి 31 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నవాబ్‌పేట ఎస్సై విక్రమ్ సూచించారు. మండలంలోని కొల్లూరు గేట్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు చందర్‌నాయక్, రాజు, కృష్ణయ్య గౌడ్, వెంకటయ్య, సేవ్యానాయక్, గోపాల్‌గౌడ్, లింబ్యానాయక్, సత్యనారాయణగౌడ్, చెన్నయ్య, రమేశ్‌గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పేదలకు అల్పాహారం వితరణ

నారాయణపేటరూరల్, జనవరి 31 : పేట జిల్లా కేంద్రంలోని చిన్న పిల్లల దవాఖాన, జనరల్ దవాఖాన వద్ద శుక్రవారం లయన్స్‌క్లబ్ మీల్స్ ఆన్ వీల్స్ వాహనంలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. రంజిత్‌కుమార్ జ్ఞాపకార్థం వారి సోదరుడు లయన్ జనార్దన్ ఈ అల్పాహార పంపిణీని చేపట్టారు. కార్యక్రమమంలో లయన్స్ క్లబ్ సభ్యు లు, రంజిత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.